# కులాసా రాదోయ్ రమ్మంటే...

**సుగుణ**

"జ్యోతన్నయ్యా!" అందొక మెత్తని స్వరం.

నన్నెవరూ పిలుస్తున్నారని వెనక్కి తిరిగాను.

కొద్దిగా లావయ్యింది. జుట్టు షార్ట్‌గా కట్ చేసుంది.

"మిన్నీ!" అని దాన్ని దగ్గరకు లాక్కుని, నెత్తి మీద ఒక మొట్టికాయ వేశాను.

"ఏమిటీ, నేను లేకుండా చూసి జుట్టంతా పీక్కుని, నమిలి మింగేశావా, అంత పొట్టిగా అయిపోయిందీ?" అన్నాను.

"స్టేట్స్‌లో పెద్ద హార్ట్ స్పెషలిస్టువై కూడా, మొట్టికాయ లెయ్యడం మర్చిపోలేదన్నమాట! జుట్టు బాగానే పెరిగిందిలే. ఈ మధ్యే పని ఒత్తిడి ఎక్కువయి బాబ్ చేయించుకున్నాను, కేర్ తీసుకోలేక" అంటూ-మిన్నీ నన్ను హత్తుకుపోయింది.

ఇద్దరం మా వయసుల్లోంచి చాలా చాలా ఏళ్లు మైనస్ చేసేసుకుని, చిన్నప్పటి అనుబంధం గుర్తు చేసుకుంటూ ఉండిపోయాం, క్షణంపాటు.

"సౌదా, జ్యోతీ, రండి రండి. భోజనాలు వడ్డించేస్తున్నారు" అని పెళ్లి వారి దగ్గర నుండి పిలుపొచ్చిందింతలో.

"జ్యోతన్నయ్యా, ఇదుగో నా కార్డు. ఫోను చెయ్యి" అని మిన్నీ, నా చేతిలో ఒక విజిటింగ్ కార్డు పెట్టి, హడావిడిగా వెళ్లిపోయింది. కార్డు చూశాను. "సౌదాఘర్, హౌస్ ఆఫ్ కార్పొరేట్ ఇమేజ్ మేకర్స్, సౌదామిని, చీఫ్ కన్సల్టెంట్" అనుంది. ఫోన్లూ, ఫాక్స్‌లూ, ఇ–మెయిల్సూ అన్నీ ఇంప్రెసివ్‌గా అయిదారు లైన్లున్నాయి.

సౌదామిని మా పెదనాన్నగారి కూతురు. వైజాగ్‌లో నాకు మెడిసిన్‌లో సీటు వచ్చినప్పుడు, హాస్టలు సదుపాయంగా ఉండదని, పెదనాన్నగారింట్లో ఒక గదిలో ఉండేవాడిని. మిన్నీకప్పుడు ఎనిమిదేళ్లు. కాబూలీవాలా సినిమాకు తీసుకెళ్లి, అప్పటినుంచీ దాన్ని 'మిన్నీ' అని పిలిచేవాడిని. నన్నొదిలి ఒక్క క్షణం వుండేది కాదు. సాయంత్రం నేను కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి, గేటు దగ్గర ఆర్చీలు పట్టుకుని వేలాడుతూ కనిపించేది. నా కోసం ఎదురుచూస్తూ జుట్టు ఒక్కొక్క పాయా జడ లోంచి లాగి, పళ్లతో కొరికి తెంపుతూ వుండేది. నన్ను చూడగానే ఆ పనాపేసి, ఒక్క దూకులో నా కాళ్లని చుట్టేసుకునేది. ఒక్కోసారి, నేను వెనక నించి దానికి కనిపించకుండా వచ్చి, నెత్తి మీద ఒక్క మొట్టికాయ వేసేవాడిని. అప్పుడు కానీ ఆ జుట్టు కొరకడం మానేది కాదు. నా మెడిసిని చదువంతా పూర్తయి, దాని తలంతా బొప్పి కడితే కానీ ఆ అలవాటు పోలేదు.

కాన్వొకేషన్‌కి పెదనాన్నగారితో వచ్చింది. అక్కడ పేర్ల మిక్సప్‌లో నన్ను ఆడపిల్లల వైపు వేసేశారు. మా ప్రొఫెసరు పొరపాటు గ్రహించి, మళ్లీ నన్ను ప్రాపర్‌గా 'పరంజ్యోతి' అని ఎనౌన్స్ చేయించాడు. ఇంటికొచ్చి కళ్లమ్మట నీళ్లొచ్చే దాకా నవ్వింది. ఆ కన్నీళ్లే నేను స్టేట్స్‌కి హయ్యర్ స్టడీస్‌కి వెళ్తుంటే, అంత సేపూ ప్రవహించేయి. ఇన్నేళ్లకి, ఇలా పెళ్లిలో కలుసుకుని, దాన్ని 'మిన్నీ' అని పిలిచేసరికే, నా మనసంతా వాత్సల్యంతో నిండిపోయింది.



స్టేట్స్‌లో వుంటుండగానే తెలిసింది. ఎమ్.బి.ఎ. పూర్తి చేసి, ఏదో అడ్వర్టయిజింగ్ ఏజన్సీలో చాలా పెద్ద పొజిషన్ కెదిగిందనీ, తన కింద పని చేసే, తన కన్నా అయిదేళ్లు చిన్నయిన శశాంక్ చతుర్వేదిని పెళ్లి చేసుకుందనీ, చరణ్ పుట్టాక, ప్రొప్రయిటర్స్‌కి శశాంక్‌ను పార్ట్‌నర్‌గా తీసుకోమని చెప్పి తను రిజైన్ చేసేసి ఫుల్ టైమ్ గృహిణిగా మారిపోయిందని కూడా విన్నాను.

తర్వాత వివరాలు ఫోను చేసి కనుక్కుందాం అనుకుని, భోజనాల హాలు వైపు రెండడుగులు వేశాను.

ఇంతలో, పక్కన బాల్కనీ వద్ద పెద్ద కమిషన్. మా స్వరాజ్యం పిన్ని కూతురు సంధ్య చూసి, పరిగెట్టి నా దగ్గరకు వచ్చి, "బంటీ బాల్కనీ మీద నుంచి కింద రూఫ్ టైల్స్ మీదకి పడిపోయాడు. పైకెక్కడం రాదు. కిందకి జారిపోతాడేమోనని భయంగా ఉంది. జ్యోతీ, డూ సమ్‌థింగ్ ప్లీజ్" అంది గాభరాగా.

నేను వెంటనే అక్కడున్న ఇద్దరు కుర్రాళ్లని తీసుకుని కింద పోర్టికోలోకి గబగబా దిగాను, బంటీ జారిపడిపోతే పట్టుకోడానికి.

ఈ లోగా ఒకాయన, అరవయ్యేళ్లు పైనుంటాయి, బాల్కనీ మీద నుంచి ఎజైల్‌గా దిగి, లాల్చీ జేబులో నించి లడ్డూ ఒకటి తీసి, బంటీకి 'ఇంద' అన్నట్లు చేయి జాచాడు. బంటీగాడు వేసుకున్న జీన్స్ రఫ్‌గా ఉండడం చేత, అవి టైల్స్‌కి అంటుకుపోయి, వాడు జారకుండా అలాగే కూర్చుని, 'ఇయ్యి' అన్నట్లు చేయి జాపాడు. తనున్న ప్రమాదకరమైన పరిస్థితి వాడి పద్దెనిమిది నెల్ల బుర్రకి ఏ మాత్రం తట్టినట్లు లేదు. ఒక్క వూపుతో, వాడి రెక్క ఒక చేత్తోనూ, బాల్కనీ రైలింగ్ ఒక చేత్తోనూ పట్టుకుని బ్యాలన్సు చేస్తూ, ఆయన బంటీని వంగి చూస్తున్న సంధ్యకి అందించి, తను పైకెక్కి వచ్చేశారు. ఇదంతా క్షణాల మీద జరిగిపోయింది. కిందనున్నవాళ్లం నోళ్లు తెరుచుకుని చూస్తుండిపోయాం.

నేను పైకొచ్చి, ఆయన చేయి పట్టుకుని, ప్రశంసాపూర్వకంగా అన్నాను, "చాలా మంది యువకులు కూడా చేయలేని పని మీరు స్కిల్‌ఫుల్‌గా, డట్

టూ ఎట్ యువర్ ఏజ్, చేసి చూపించారు. ఇట్స్ రిమార్కబుల్!"

ఆయన నవ్వుతూ నా చేయి నొక్కి వెళ్లిపోబోతూ, ఆగి, "పరమ్!" అన్నారు.

నేనాయన ముఖంలోకి తేరిపారజూసి, "రతన్!" అని కౌగిలించుకున్నాను.

రత్నాకర్ కాకినాడలో నా స్కూల్ మేట్. స్కూల్లో అంతా మా ఇద్దర్నీ ఆడపేర్లతో పిలిచి ఏడిపించేవారు. మేమ్మటుకు ఒకరినొకరం, పరమ్—రతన్ అని పిల్చుకునేవాళ్లం. మేమిలా చిత్రంగా ఈ పెళ్లిలో కలవడం, చాలా సంతోషమనిపించింది. ఇద్దరం ఒకళ్ల న్యూస్ ఒకళ్లకి త్వరగా చెప్పేసుకున్నాం. వాడు 'విశారద' అని డిగ్రీ కాలేజీ స్థాపించి, ప్రిన్సిపాల్‌గా వున్నాడట. నేను స్టేట్స్ నుంచి హార్ట్ కేర్ స్పెషలైజేషన్ ఇండియాలో అందుబాటుకి తెచ్చి, హాస్పిటల్ కడుతున్నట్లు చెప్పాను. "చాలా బావుందిరా" అంటే "చాలా బావుందిరా" అనుకుని, తర్వాత కలవడానికి ఏర్పాటు చేసుకుని, భోజనాల హాల్లోకి వెళ్లిపోయాం. అక్కడ కూడా రతన్ పెళ్లి పాటలవీ పాడి అదరగొట్టేశాడు. స్కూల్లో పాటల పోటీల్లో ఎప్పుడూ వాడిదే ఫస్టు. అన్నీ లతామంగేష్కర్ పాటలే పాడేవాడు, అప్పటికింకా వాయిస్ బ్రేక్ అవక.



తర్వాత ఒక రోజు హాస్పిటలు పనుల్లోంచి తీరిక చేసుకుని, మిన్నీకి ఫోను చేశాను.'దాని ఫిఫ్టీయెత్ బర్త్ డేకి శశాంక్ ఇచ్చిన గిఫ్టు విడాకులట. ఆఫీసులో పని చేసే రిసెప్షనిస్టు మాయా బాత్రాని పెళ్లి చేసుకోడానికి నిశ్చయించుకున్నాడుట. ఆ అమ్మాయికి ఇరవై మూడేళ్లట. వాళ్లిద్దరూ కలిసి 'పాట్' స్మోక్ చేస్తారుట. అదీ బంధం.

గొంతు నిండా బాధ నింపుకుని అంది మిన్నీ. "జ్యోతన్నయ్యా, ఇవన్నీ అంగీకరించాను కానీ, 'సౌదా, నీకు ఏభయ్యేళ్లు వచ్చేశాయి. బెడ్ మీద ఛార్మ్ పోయింది. యు ఆర్ టూ ఓల్డ్' అని శశాంక్ ఆఖర్న వేసిన చురక మాత్రం భరించలేకపోయాను. చరణ్ అప్పుడప్పుడే యవ్వనంలోకి అడుగు పెడుతున్నాడు. ఈ మాటలు వాడి మీద ఎటువంటి ప్రభావం చూపించుంటాయో ఆలోచించు. ఇంకేం డిస్ప్యూట్ చేయక డైవోర్స్ పేపర్స్ మీద సంతకం చేసేశాను. ఆ వెంటనే 'సౌదాఘర్' మొదలెట్టేశాను. ఈ మూడేళ్లలో ఫర్మ్‌ని బాగా వృద్ధిలోకి తీసుకురాగలిగాను. చరణ్‌ని కాకినాడ మెడికల్ కాలేజ్‌లో చేర్చాను. వాడిని నీ అంత డాక్టర్‌ని చేయాలని నా కోరిక' అని మిన్నీ ఫోనులో సైలెంట్‌గా అయిపోయింది. శబ్దం రాకుండా ఏడవడం దాని స్పెషాలిటీ.

"ఇప్పుడు నీ జ్యోతన్నయ్య దగ్గరలోనే వున్నాడుగా, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఫోను చేయి. ఏం?" అని దాన్ని వూరడించి, మనసంతా భారంగా అయి ఫోను పెట్టేశాను.

"పరమ్, నీతో చిన్న పని పడిందిరా, ఎప్పుడు కలుద్దాం?" అని రత్నాకర్ ఒక రోజు ఫోను చేశాడు. టైం ఫిక్స్ చేసుకుని వాడింటికి వెళ్లాను. ఇద్దరం లాన్‌లో కూర్చున్నాం. ఫ్రెష్ లైమ్, సోడా సిప్ చేస్తూ.

"చెప్పు, ఏమిటి సంగతి?" అన్నా.

"నాకు ఆరునెల్ల క్రితం ఎపెండిక్స్ ఆపరేషనైంది. ఫిజికల్‌గా ఫిట్‌గానే ఉన్నాను. ఏవో కొన్ని పనులు చేయద్దన్నారు డాక్టర్లు. ఇక్కడ డాక్టర్లందరికీ నేను ఇంటిమేట్‌గా తెలుసు. నా భార్య శారదకి పుట్టిన పిల్లాడు పురిటిలోనే పోయేసరికి ఎక్యూట్ డిప్రెషన్ వచ్చి, ఆరోగ్యం బాగా దెబ్బ తింది. చాలా యేళ్లు మా దూరపుబంధువు ఒకావిడని శారదకి తోడుగా ఇంట్లోనే వుంచాను. నేను రిటైరయిన సంవత్సరమే ఆవిడకి జాండిస్ వచ్చి, హఠాత్తుగా చనిపోయింది."

"ఆ తర్వాత నేనే చూసుకుందామని ప్రయత్నం చేశాను కానీ, నాకూ శారదకూ కనెక్టివిటీ పోయింది. డాక్టర్ల సలహా మీద, ఆవిడ మంచి కోరి, ఓల్డు ఏజ్ హోమ్‌లో పెట్టి ఏడేళ్లయ్యింది. వెళ్లి చూసి వస్తూంటాను. ఎవరితోనూ మాట్లాడదు. ఇంకా ఆ పోయిన పిల్లాడినే తల్చుకుంటూ ఉంటుందని డాక్టర్లు చెప్పారు. నేను చేయగలిగిందేమీ లేదని ఎప్పుడో నిర్ధారణ కొచ్చేసాను. గిల్ట్ ఫీలింగ్ అనవసరమని సైకాలజిస్టులు కూడా చెప్పారు. ఇప్పుడీ విషయం ఎలా అడగాలో తెలియడం లేదు" అన్నాడు రత్నాకర్, ఇబ్బందిగా అటూ ఇటూ కదిలి.

"మీ ఆవిడ ఇన్నాళ్లకి 'కమ్ టు బెడ్ విత్ మీ' అందా ఏమిటి?" అన్నాను, వాడి డిస్కంఫర్ట్‌కి కారణం గెస్ చేసి. స్టేట్స్‌లో ఇలాంటివి చాలా సాధారణవిషయాలు. ఇన్‌హిబిషన్స్ వుండవు. ఇండియాలో కొన్ని చెప్పడానికి మనుషులు మొహమాటపడతారు.

"కమ్ టు బెడ్ విత్ మీ అన్నది ఇంకొకరు" అన్నాడు రత్నాకర్.

"నా విమెన్స్ కాలేజీ అంతా ఆడవాళ్లే. కానీ ఎవరినీ కన్నెత్తి ఆ దృష్టితో నేనెప్పుడూ చూడలేదు. పాటలు పాడుకోడం, వినడం, తోటపనీ, పుస్తకాలూ, వీటితోనే టైము ఫిల్ చేసుకునేవాడిని. సెక్స్ ఆలోచనకి తావిచ్చే వాడినే కాదు. అదీ గాక, నాకు పెళ్లి అనే ఇన్‌స్టిట్యూషన్ అంటే ఎనలేని గౌరవం. శారదంటే తెలియజెప్పలేని లాయల్టీ. ఇవన్నీ కలిసి నన్ను పక్కదారులు పట్టనిచ్చాయి కావు."

(మిగతా వచ్చేవారం)